# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 20-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు 2025ను లోక్ సభ ఈరోజు ఆమోదించింది.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 22వ తేదీన బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు.
- ఐఐఎం సవరణ బిల్లు, 2025కు పార్లమెంటు ఈరోజు ఆమోదం తెలిపింది.
- ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సి.పి.రాధాకృష్ణన్ ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31న ప్రసారమవుతుంది.

=======================

ఆన్‌లైన్ గేమ్స్‌ను నియంత్రించేందుకు ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు లోకసభలో ప్రవేశపెట్టారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ఎక్కువ అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లు పై అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ... ఇ-స్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమ్స్‌ను ప్రోత్సహిస్తూనే.. హానికరమైన ఆన్‌లైన్ మనీ గేమింగ్ సేవలు, ప్రకటనలు, వాటికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను నిషేధిస్తుందన్నారు. అలాగే ఆన్ లైన్ గేమ్స్ నుండి దేశ యువతను కాపాడేందుకు ఈ బిల్లు దోహదపడుతుందని అశ్విని వైష్ణవ్ వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

చర్చ అనంతరం ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

=======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 22వ తేదీన బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా బీహార్‌లోని గయలో సుమారు 13 వేల కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. గంగా నదిపై 1,870 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 6 వరుసల వంతెనను ప్రారంభిస్తారు. అలాగే 6,880 కోట్ల రూపాయల విలువైన బక్సర్ థర్మల్ పవర్ ప్లాంట్ తో పాటు మరికొన్ని అభివృద్ధి పనులను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. వీటితో పాటు, అదే రోజు సాయంత్రం కోల్‌కతాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు.

=======================

దేశంలో గత 11 సంవత్సరాల్లో ప్రభుత్వం విద్యా రంగంలో అనేక సంస్కరణలను తీసుకువచ్చిందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) సవరణ బిల్లు, 2025ను ఈరోజు పార్లమెంటు ఆమోదించింది. ఈ బిల్లుపై జరిగిన చర్చకు ధర్మేంద్ర ప్రధాన్ సమాధానమిస్తూ... 2013 నాటికి ఐఐఎంలలో కేవలం 3,500 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా, ఆ సంఖ్య 9,800కి చేరిందన్నారు. అంతకుముందు బిల్లును ప్రవేశపెడుతూ... ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ యాక్ట్, 2017ను ఇది మరింత సవరిస్తుందని కేంద్రమంత్రి తెలిపారు. దేశంలోని ఈశాన్య ప్రాంతంలో ముఖ్య కేంద్రమైన అస్సాంలోని గౌహతిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌ను స్థాపించడానికి ఈ బిల్లు దోహదపడుతుందన్నారు. దేశంలో ప్రస్తుతం పని చేస్తున్న 21 ఐఐఎంలు విద్యా రంగంలో తమదైన ముద్ర వేశాయన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఐఐఎం గౌహతిలో ప్రవేశాలు ప్రారంభమవుతాయని ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు.

=======================

ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్ ఈరోజు పార్లమెంట్ హౌస్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేయడానికి ముందు, సిపి రాధాకృష్ణన్ పార్లమెంటు భవన సముదాయంలోని ప్రేరణ స్థల్ వద్ద ప్రముఖ దేశ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఇక ఉపరాష్ట్రపతి ఎన్నిక వచ్చే నెల 9వ తేదీన జరగనుంది.

=======================

కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వాల సవరణ బిల్లు, జమ్మూ కాశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ సవరణ బిల్లులను ఈరోజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం, ఆ బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపారు. ఈ బిల్లులపై ప్రతిపక్ష పార్టీ సభ్యులు వ్యతిరేఖతను వ్యక్తం చేశారు. ఇవి రాజ్యాంగ విరుద్ధమైనవని, సమాఖ్య విధానానికి వ్యతిరేకమైనవని నినాదాలు చేశారు. ఈ బిల్లులు అధికార వికేంద్రీకరణను, ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రజల హక్కును ఉల్లంఘిస్తున్నాయని తెలిపారు. ఈ మూడు బిల్లులను ఉపసంహరించుకోవాలని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

విరామం

=======================

రష్యా పర్యటనలో ఉన్న భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఈరోజు రష్యా అధికార ప్రతినిధులను కలిసి పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో భారత్-రష్యా సంబంధాలు, సమకాలిన ప్రపంచ భౌగోళిక రాజకీయాలు పట్ల భారతదేశ దృక్పథాన్ని వెల్లడించినట్లు జైశంకర్ సామాజిక మాధ్యమంలో తెలిపారు. వర్తక, వాణిజ్యంలో ఆర్థిక, శాస్త్రీయ, సాంకేతిక, సాంస్కృతిక సహకారంపై భారత్- రష్యా దేశాల 26వ సమావేశంలో జైశంకర్

ఈరోజు పాల్గొన్నారు. మాస్కోలో జరిగే భారత్-రష్యా వ్యాపార వేదిక సమావేశంలో కూడా ఆయన ప్రసంగిస్తారు. పర్యటనలో భాగంగా జైశంకర్ రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్‌తో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై చర్చించనున్నారు.

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=======================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 81,644 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై... చివరికి 213 పాయింట్ల లాభంతో 81,857 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 69 పాయింట్ల లాభంతో 25,050 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.06గా ఉంది.

=======================

గుజరాత్, గోవా, మహారాష్ట్ర తీర ప్రాంతాల్లో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) వెల్లడించింది. ఈ ప్రాంతాలలో రెడ్ అలర్ట్ జారీ చేసింది. జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, తూర్పు రాజస్థాన్‌లలో కూడా రాబోయే రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని IMD పేర్కొంది. అలాగే దక్షిణ భారతదేశంలోని కర్ణాటక, తెలంగాణలోని పలు ప్రాంతాలలో రాగల 24 గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి శశికాంత్ మిశ్రా వివరిస్తూ..

(వాయిస్ 29 సెకన్లు)

=======================

బ్రాడ్‌బ్యాండ్, యుపిఐ, డిజిటల్ పాలనలో భారత్ సాధించిన పురోగతి ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. "హుకింగ్ ఆఫ్ టు ది నెక్ట్స్ టెలిలెవెల్" అనే జాతీయ దినపత్రికలో కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా రాసిన కథనాన్ని ప్రధానమంత్రి ఈరోజు సామాజిక మాధ్యమం ఎక్స్ లో పంచుకున్నారు. దేశం నిర్ణీత ప్రమాణాలను సాధించడానికి 5G, AI, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ తదితర రంగాలు దోహదపడుతున్నాయని ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

=======================

ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ లో భారత షూటర్లు సౌరభ్ చౌదరి, సురుచి ఇందర్ సింగ్ ల జోడీ కాంస్యం పథకం సాధించారు. ఈరోజు కజకిస్తాన్‌లో జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో చైనీస్ తైపీ జోడీని ఓడించి భారత ద్వయం కాంస్యం గెలుచుకుంది.

=======================
=======================